# బూచి

ఈరోజు భూషయ్య ముఖంలో ఏదో విశేషం తొంగి చూస్తున్నది. కిర్రు చెప్పుల శబ్దం చిత్రంగా ధ్వనిస్తుంటే, పైపడ్డ వయస్సును ఖాతరు చేయకుండా వడిగా అడుగులేస్తున్నాడు. అంత ఉత్సాహం ఇటీవలి కాలంలో భూషయ్యకు ఎన్నడూ కలగలేదు.

వీధిగుండా నడుస్తున్న భూషయ్యకు పసిపిల్ల ఏడుపు, ఆ ఏడుపుతో పాటు పిల్లను సముదాయిస్తున్న తల్లిగొంతు వినబడింది.

"అమ్మో! అదుగో బూచియ్య" అంటూ ఆ తల్లి భూషయ్యకేసి చూపిస్తున్నది.

ఆ పసిదాని దృష్టిలో ఇంకా భూషయ్య పడనేలేదు. ఏడుస్తూనే వున్నది.

"వచ్చేస్తున్నాడమ్మా! ఏడిస్తే బూచియ్య పట్టుకుపోతాడు" చేత్తో భూషయ్య వస్తున్న దిక్కుగా చూపింది.

భూషయ్య కంటబడుతూనే ఆ పిల్ల టక్కున నోరు మూసింది. బితుకుబితుకుమంటూ ఆయన కదలికల్ని గమనించసాగింది.

భూషయ్య ఎప్పటిలా ముసిముసిగా నవ్వుకుంటూ ముందుకు సాగిపోలేదు. తనను చూస్తూనే పసిపిల్ల భయపడి పోయినందుకు గర్వపడలేదు. సూటిగా బిడ్డనెత్తుకుని నిలుచున్న ఆ తల్లి దగ్గరికే నడిచాడు. ఆ పిల్ల తల్లి ఆశ్చర్యంగా చూస్తుండిపోయింది.

భూషయ్యను గమనిస్తున్న పసిది తల్లి చేతుల్లో మెల్లగా తీగలు సాగుతూ గింజుకుంటున్నది.

"ఎందుకమ్మా, ఏడుస్తున్నది?" అడిగాడు వాత్సల్యంగా.

"వీధిలో తిప్పకు రావాలంట" అన్నది ఆ తల్లి కూడా బెరుగ్గానే.

భూషయ్య నవ్వేడు. "అట్టావా!....రారా అమ్మడూ, నేను తిప్పుతాను" అంటూ చేతులు చాపి పిల్లను అందుకోబోయాడు.

ఆ పసిపిల్ల భయంతో కెవ్వుమన్నది. భూషయ్య ఉలికిపాటుగా చేతులు వెనక్కు తీసుకున్నాడు.

"భయపడుతున్నది తాతా!" అంటూనే ఆ తల్లి పిల్లను చంకనేసుకొని వాకిట్లో నుండి లోపలకు దుమికినంత పనిచేసింది.

భూషయ్యకు నవనాడులూ కృంగిపోయాయి. తను అనుకున్నది అనుకున్నట్లుగా జరగనందుకు కించపడ్డాడు. క్షణాల్లోనే తేరుకుని భారంగా ముందుకు నడిచాడు.

వెనుక పసిపిల్ల ఏడుపు తగ్గుముఖం పట్టింది. సన్నని కూనిరాగంతో పాటు తల్లిగొంతు వినిపించింది.

"ఇంకా ఏడుస్తావెందుకే?"

"బూ....సి....బూసే" అంటూ పసిపిల్ల భూషయ్యకేసి చూపిస్తూ అన్న మాటలు శూలాల్లా గుచ్చుకున్నాయి మనస్సులో.

భూషయ్య కళ్ళల్లో నీటి సుడి గిర్రున తిరిగింది.

ఈ పసికూనలు తన తపనను అర్థం చేసుకోవేం! ఎన్నడయినా ఒక్క పసిబిడ్డ చెవి మెలిదిప్పి ఎరుగుదునా! ఎందుకింత భయం!

నిజానికి భూషయ్య పిల్లల్ని దెబ్బవేస్తుండగా చూశామన్న వాళ్ళు ఆవూరిలో ఒక్క రూలేరు. ఆయన పేరు చెవినేస్తే చాలు పసిపిల్లలు కిక్కురుమనరు. ఆకతాయి పిల్లలు కుక్కిన పేనుల్లా పడుంటారు. గొంతు విప్పి "ఆయ్" అంటూ అరిస్తే బెదిరిన లేడి పిల్లలా పరుగులు పెడ్తారు.

భూషయ్య ఆరడుగుల స్థూలకాయంతో దిట్టంగా వుండే మనిషి. నుదుట చెక్కు చెదరని ఎర్రని బొట్టు. తలమీద బుట్టలా రంగుపాగా, మిడిగుడ్లు ఎర్రజీరలతో నెత్తుటిముద్దల్లా వుంటాయి.

బొద్దుమీసాలు కదిలిస్తూ హూంకరిస్తే పిల్లలు జడుసుకుని పంటేలు పోసుకోవల్సిందే.

తన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే భూషయ్య ఆకార భీకరత్వం ఆయన్నో బూచిని చేసింది.

వీధిలో కిర్రు చెప్పుల శబ్దం చెవిన బడిందంటేచాలు. పిల్లకాయలు ఇళ్ళల్లో ముసుగుదన్ని పడుకునేవాళ్ళు. తిండి దగ్గర పేచీలు పెట్టే పిల్లలకు, బడికి వెళ్లమని మారాం చేసే పిల్లలకు భూషయ్యంటే సింహస్వప్నం.

"అమ్మో! వాన్నొస్తున్నారు. అల్లరి చేస్తే చంపేస్తారు" తండ్రి భయంపెట్టి భార్య, పిల్లల్ని అదుపు చేస్తుంటే పిల్లలపై వున్న మమకారాన్ని మనస్సులోనే దాచుకున్నాడు.

తోబుట్టువులు సైతం తమ పిల్లల్ని చెప్పుచేతల్లో వుంచుకునేందుకు పిల్లల్ని భయపెడ్తూ దగ్గరికే చేరనివ్వలేదు.

క్రమంగా ఇరుగుపొరుగువాళ్ళు కూడా పిల్లల్ని లొంగదీసు కునేందుకు భూషయ్య పేరు నుపయోగించటానికి అలవాటు పడ్డారు. ఈ రకంగా పిల్లల్లో కూడా ఆయనకు గొప్ప ప్రచారం వచ్చేసింది. పోనుపోను భూషయ్య బూసియ్యగా, బూసియ్య బూచిగా వూరిలో పేరుపడ్డాడు.

ఈ విధంగానే రెండు మూడు తరాల పిల్లలు భూషయ్య కళ్ళముందే ఎక్కివచ్చారు. ఊహ బాగా తెలిసిందాకా వాళ్ళంతా ఆయనను చూస్తే గజగజలాడిన వాళ్ళే.

తను కంటబడితే వీధిలో ఆడుకుంటున్న పిల్లలు పారిపోయి దాక్కోవటం గుక్కబెట్టి ఏడ్చే పసిపిల్లల నోళ్ళు మూతబడటం భూషయ్యకు ఆనందంగానే వుండేది. మీసాలు మెలేస్తూ ముసిముసిగా నవ్వుకునేవాడు.

ఇప్పుడు భూషయ్యకు ఎనభైయ్యేళ్ళు నిండాయి. ఇంతకాలం బూచిగా అందర్నీ భయపెట్టిన ఆయనను ఒంటరితనం ఇప్పుడు బూచిలా భయపెడ్తున్నది. గుంపు చీలిన పక్షిలా విలవిలలాడి పోతున్నాడు!

తన తరం తరలి పోయింది. కుర్రకారు పెద్దవాడన్న భక్తిభావంతో నోరెత్తి మాట్లాడరు. పిల్లాపీచు కంటబడితే చాలు, పత్తావుండరు. ఎవరితోను కలవలేక ఎవరి తోను ఇమడలేక దిగులుతో కృంగి పోతున్నాడు.

ప్రొద్దు పొడిచినప్పటి నుండి ప్రొద్దువాలేదాకా కాలం గడపటం దుర్భరంగా వున్నది. ఒంటరితనం దీర్ఘవ్యాధిలా పట్టి పీడిస్తున్నది.

కేరింతలు కొట్టే పసిపిల్లలతో కాలం గడపాలనీ, వాళ్ళను చేరదీసి చిట్టిపొట్టి కథలు చెప్పాలనీ, బూచిలా కాక మంచి తాతయ్యలా పిల్లల మనస్సులో స్థానం పొందాలనే ఆరాటం భూషయ్యలో ఎక్కువయింది.

ఒక సందులో గుంపుగాచేరి ఆడుకుంటున్న పిల్లలు భూషయ్య కంటబడ్డారు. వాళ్ళు పసిగడ్తారేమోనని అడుగులో అడుగువేస్తూ కిర్రుచెప్పులు శబ్దం చేయకుండా మెల్లగా అటువెళ్ళాడు. కడగా నిలుచుని వాళ్ళ ఆటల్ని చూస్తూ ఆనందించ సాగేడు.

ఇంతలో ఒక గడుగ్గాయి చూడనే చూసేడు.

"ఒరేయ్, అడుగో బూచి!" అంటూ పొలికేక పెట్టాడు.

మందుగుండు శబ్దం విన్న పిట్టల్లా వాళ్ళు కేకలు పెడుతూ కకావికలై పరిగెడుతుంటే భూషయ్య గొంతెత్తి పిలిచాడు.

"పిల్లలూ! మిమ్మల్నేం చేయ్యన్రా! మీతో నేనూ ఆడతాను. కొత్తకొత్త ఆటలు నేర్పుతాను" అంటూ నిలువరించబోయేడు.

పిల్లలు ఆ మాటల్ని విశ్వసించ లేకపోయారు. చాటున నక్కి, నిక్కినిక్కి చూస్తూ వుండిపోయారే గాని ఒక్కడూ ఇవతలకు రాలేదు.

భూషయ్య కొద్దినిముషాలు బొమ్మలా అక్కడే నిలుచుండిపోయాడు.

"నేనెప్పుడన్నా ఒక్కదెబ్బవేశానట్రా"

"..............."

"మీకు భట్టివిక్రమార్కకథ చెప్తాన్రా!"

"..............."

"పులీ మేక ఆట నేర్పుతాన్రా!"

"..............."

పిల్లలు భూషయ్య మాటలు వింటూ వింతగా చూస్తున్నారే గాని వీధిలోకి అడుగుపెట్టే సాహసం లేకపోయింది.

"సరే! నామాట వినరుగా! నమ్మరుగా!....అయితే మీ అందరితో పచ్చిరా.. టీ..." అంటూ బొటనవేలిగోటితో మునిపంటిని మీటి అలక ప్రదర్శిస్తూ ముందుకు కదిలాడు.

తన ప్రయత్నాలు ఈ విధంగా బెడిసి కొట్టటంతో గుండె బాధతో బరువెక్కింది. తన ఓటమికి పుట్టెడు దిగులు కలిగింది.

భూషయ్య వెళ్ళిపోవడం గమనించి దాక్కున్న పిల్లలు ఒక్కొక్కరే పిల్లుల్లా బయటపడి వీధిలో కొచ్చారు.

"బూచి....టీ....టీ...." అంటూ ఒక్కొక్కరే పెద్దగా అరవ సాగేరు.

కేకలు భూషయ్య చెవిన బడ్డాయి. వాళ్ళ తిరస్కారానికి కళ్ళు చెమ్మగిల్లాయి. నిలబడి అరవనూలేదు. వెనుదిరిగి చూడనూ లేదు.

సూర్యాస్తమయానికి కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి చేరుకున్నాడు. అన్నం ముందు కూర్చుంటే ముద్ద మింగుడు పడలేదు. నిద్రలో కదిలి మునిమనుమడు కేరుమన్నాడు.

"తాతయ్యొచ్చార్రా...కొడ్తారు" అన్నది జోకొడుతూ పిల్లాడి తల్లి. పిల్లాడు నోరు మూసేశాడు.

భూషయ్య పళ్ళెంలో చేయి కడుక్కుని లేచిపోయాడు.

వీధి అరుగుమీద పక్క పరుచుకుని పడుకున్నాడేగాని కంటి మీదికి కునుకు రాలేదు.

ఈలోకమంతా ఏకమై కూడ బలుక్కుని తనను దగా చేసినట్లుగా బాధపడసాగేడు. కర్కశత్వపు ముసుగులో తనను తాను ఎంతగా మోసం చేసుకున్నాడో అర్థమైంది.

ఆ చిన్నారి లోకానికి చేరువయ్యే మార్గం కోసం రాత్రంతా ఆలోచిస్తూనే వున్నాడు. ఆలోచించిన మీదట ఎప్పటికోగాని ఉపాయం తట్టలేదు. అప్పుడు గాని ప్రశాంతంగా నిద్రపట్టలేదు.

వీధిలో నడుస్తున్న భూషయ్యకు పసిబిడ్డ ఏడుపు వినిపించింది. ఏడుపు వినవస్తున్న ఇంటికేసి నడిచాడు. లోపలకు అడుగు పెడ్తున్న భూషయ్యను చూసి ఆ పిల్లతల్లి 'బూచి' అని జడిపించటం మర్చిపోయి విచిత్రంగా చూస్తుండి పోయింది.

కిర్రుచెప్పులులేని పాదాలు నిశ్శబ్దంగా ఆ తల్లి ముందుకు నడిచాయి.

చేతులుజాపి, "ఎందుకురా అమ్మడూ ఏడుస్తున్నావ్!" అంటూ ఎత్తుకోబోయేడు.

ఆ పసిది టక్కున ఏడుపు ఆపింది. భూషయ్య ముఖంలోకి క్రొత్తగా, బెరుగ్గా చూడసాగింది. ఎప్పటిలా భయంతో కెవ్వున అరవలేదు.

"దామ్మడూ! నీకు బుజ్జాయిల్ని చూపెడ్తానురా" ప్రేమగా పసిదాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు.

భూషయ్య ముఖం మీద చేతులాడిస్తూ బోసిగా నవ్వింది పసిపిల్ల. ఆయన గుండెలో గూడుకట్టుకున్న విషాదాన్ని ఆ నవ్వు ఒక్కసారిగా కరిగించి వేసింది.

ఆపిల్ల భయపడేందుకు భూషయ్య కళ్ళల్లో తీక్షణతలేదు. మూతి మీద బొద్దుమీసాలు లేవు. నుదుట బొట్టులేదు. తలమీద రంగుపాగా లేదు. రూపురేఖలు మారిపోయాయి.

పసిదాన్ని భుజానేసుకుని వీధిలోకి అడుగుపెట్టిన భూషయ్యను చూస్తూ ఇరుగుపొరుగు అమ్మలక్కలు, ఈ విడ్డూరానికి నోళ్ళు నొక్కుకున్నారు.

(స్వాతి మాసపత్రిక, ఆగస్టు 1986)